# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY


### దిలావర్ పూర్ లో ఉద్రిక్తత..ఆర్డీవో నిర్భందం

నిర్మల్ నిర్మల్ జిల్లా లో ఇతనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు ను నిరసనగా మంగళవారం ఉదయం నుంచి దిలావర్ పూర్ –గుండం పల్లి గ్రామస్తులు జాతీయ రహదారి దిగ్బందించారు. అక్కడికి వెళ్లి ఆర్డీవో రత్న కల్యాణి ని చుట్టు ముట్టారు. వాహనం తో సహా నిర్భందించారు. ఈ క్రమంలో ఆర్డీవో ను వదలి పెట్టాలని ఎస్పీ జానకి షర్మిల పలు మార్లు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వచ్చి హామీ ఇస్తేనే ఆందోళన విరామిస్తామని స్పష్టం చేశారు. రాత్రి అయినా కూడా ఆందోళన కొనసాగడం తో ప్రత్యేక బలగాల ను తెప్పించారు. ఆర్డీవో ను సురక్షితంగా ఆందోళన కారుల నిర్భంధం నుంచి విడిపించి జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రజలు అడ్డుకోవడం తో తోపులాట జరిగింది.ఆర్డీవో వాహనాన్ని ఆందోళన కారులు ధ్వంసం చేశారు.


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 28-11-2024 సంపుటి : 06 సంచిక : 59 పేజీలు : 8 వెల : రూ 3-00


## ప్రధాని నరేంద్ర మోదీతో పవన్‌కల్యాణ్ భేటీ




అమరావతి నవంబర్ 27:(( విభారె) : ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రధాని నరేంద్ర మోదీని బుధవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నిన్న ఢిల్లీకి చేరుకున్న పవన్‌కల్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. కేంద్రమంత్రి భూపేంద్రయాదవ్‌తో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్రానికి పలు పథకాలు, నిధులు విడుదల చేయాలని మంత్రులకు వినతిపత్రాలను అందజేశారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, టీడీపీ ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి పవన్‌తో సమావేశమయ్యారు.

చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును ఖండించిన పవన్‌కల్యాణ్ బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకులు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఖండించారు. హిందువులను లక్ష్యంగా చేసుకుని కొనసాగుతున్న దాడులను కలిసికట్టుగా ఎదుర్కొందామని ట్విటర్ వేదిక ద్వారా పిలుపునిచ్చారు.హిందువులపై అఘాయిత్యాలను ఆపాలని బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలికసారథిమహమ్మద్‌యూనస్‌ను కోరారు. పాకిస్తాన్‌లో దాడులు జరిగితే హైదరాబాద్ పాతబస్తీలో లేచి మాట్లాడు తారు. పక్క దేశంలో బంగ్లాదేశ్‌లో ఊచకోత జరిగితే భారతదేశం సమాజం స్పందించక పోవడం ఆందోళనకు గురిచేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రాథమిక బాధ్యతగా గుర్తించి మాట్లాడాలని కోరారు.

## మోదీ నిర్ణయుమే ఫైనల్..

### మహారాష్ట్ర సీఎం పదవిపై ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ:నవంబర్ 27:( విభారె) మహారాష్ట్రలో సీఎం పదవిపై ఉత్కంఠ కొనసాగుతున్న నేపథ్యంలో అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ సిండే కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు ఎలాంటి అసంతృప్తి లేదని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి పదవిపై నిర్ణయం ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. బుధవారం థానేలో ఆయన నివాసంలో షిండే మీడియాతో మాట్లాడుతూ.. వాళ్ల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.పోరాటం తన రక్తంలోనే ఉందని ఏక్‌నాథ్ షిండే తెలిపారు. మహాయుతి గెలుపు కోసం కార్యకర్తగా పనిచేశానని తెలిపారు. ఒక కార్యకర్తలా చెప్పులు అరిగేలా తిరిగానని పేర్కొన్నారు.తమ పార్టీకి అతిపెద్ద విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మహావికాస్ అఘాడీ కూటమిని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. తన దృష్టిలో సీఎం అంటే కామన్ మ్యాన్ అని చెప్పారు. అందుకే తాను సీఎంగా ఏనాడూ ప్రవర్తించలేదని.. ఒక సామాన్యుడిలాగే ప్రజల్లో తిరిగానని తెలిపారు. తాను సామన్య రైతు కుటుంబం నుంచి వచ్చానని, పేదల కష్టాలు, బాధలన్నీ తెలుసునని అన్నారు. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు చూశానని పేర్కొన్నారు. బాల్ థాక్రే ఆశయాలను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. మహారాష్ట్ర అభివృద్ధే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు.తనకు ప్రధాని మోదీ పూర్తి మద్దతు ఉందని ఏక్‌నాథ్ షిండే తెలిపారు. పేరు కోసం పాకులాడటం తనకు ఇష్టం ఉండదని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు తాను, తన సహచరమంత్రులు 24/7 పనిచేశామని తెలిపారు. ఇక మహారాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ఎవరిని ఎంపిక చేయాలో బీజేపీ హైకమాండ్ నిర్ణయానికే వదిలేశామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పదవిపై మోదీ, అమిత్‌షా నిర్ణయమే ఫైనల్ అని.. వాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

## పార్లమెంటులో మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ప్రస్తావన



ఢిల్లీ నవంబర్ 27:( విభారె) పార్లమెంటులో మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ప్రస్తావన వచ్చింది. నదీ పునర్జీవ నం కోసమే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజె క్టు కోసం పెద్ద ఎత్తున కూల్చి వేతలు ఉండవని రాష్ట్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. పెద్దఎ త్తున ప్రజలను నిరాశ్రయులు చేయమని కూడా రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని అన్నారు. అవసరం మేరకు మాత్రమే తొలగింపులు తరలింపు చేస్తామని పేర్కొంది .తొల గింపులు, తరలింపులు చెస్తే బాధిత కుటుంబాలకు తగిన విధంగా సహాయ పునరావాస చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.నదీ పునర్జీవనం కోసం భూసేకరణకు, భూములు కోల్పోయే బాధిత కుటుంబాలకు విషయంలో సంబంధిత చట్టాల ప్రకారం ముందుకు వెళ్తామని కూడా రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మూసీ నదీ గర్భం నుంచి, బఫర్ జోన్ నుంచి తరలించే వారికోసం మానవతా దృక్పథంతో 15 వేల ఇళ్లను కేటాయించినట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. నదీ పునర్జీవం, కాలుష్య నివారణ , వరదల బారి నుంచి కాపాడేందుకే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. బాధిత కుటుంబాల కోసం వారి జీవన ప్రమాణాలకు మద్దతు కోసం ఒక కమిటీని కూడా నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు, ప్రజల నుంచి వస్తున్న ఆందోళనలు గురించి రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి ప్రస్తావించారు. సురేష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు రాతపూర్వక సమాధానంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహు వివరాలు వెల్లడించారు.కాగా.. రాష్ట్ర ప్రభుత్వానికి మానస పుత్రిక మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టును త్వరలోనే పట్టాలెక్కించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలను త్వరలోనే తొలగించనున్నారు. దీనిపై మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌ఎఫ్‌డీసీఎల్) సన్నాహాలు చేస్తోంది. ఈ తొలగింపులో సర్వం కోల్పోయే కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. సంబంధిత కుటుంబాల జాబితాను కొద్ది రోజుల్లో ప్రకటించనున్నారు.

## ఏపీ సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు రిమాండ్



అమరావతి నవంబర్ 27( విభారె) : నరసాపురం మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో నిర్బంధించిన కేసులో ఆరోప ణలు ఎదుర్కొంటున్న ఏపీ సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్ పాల్‌కు గుంటూరు కోర్టు 14రోజులపాటు రిమాండ్ విధిం చింది. అనంతరం ఆయ నను గుంటూరు జిల్లా జైలుకు తరలిం చారు.నిన్న ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన విజయ్‌పాల్‌ను పోలీసు లు సుదీర్ఘంగా విచారించి రాత్రి అరెసు చేశారు. బుధవారం ఆరోగ్య పరీక్షల అనంతరం గుంటూరు కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా పోలీసులు ఆయనపై 11 పేజీల రిమాండ్ రిపోర్టును కోర్టు ముందుంచారు. ఆయనను రెండువారాల రిమాండ్‌కు ఇవ్వాలని కోరారు.వాస్తవాలు రాబట్టేందుకు విజయ్‌పాల్‌ను కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. రఘురామను చిత్రహింసల కేసులో విజయ్‌పాల్ పాత్ర కీలకమని వెల్లడించారు. చిత్రహింసల వెనుక ఉన్న సూత్రధారులను కనుగొనాల్సి ఉన్నందున ఇంటరాగేషన్‌కు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు

## అంగన్వాడి, సచివాలయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 27 – దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నే గ్రామంలో అంగన్వాడి, గ్రామ సచివాలయ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్ర తనిఖీలో భాగంగా పిల్లలకు సంబంధించిన హాజరు నమోదు వివరాలను అంగన్వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు ఎంతమంది ఉన్నారు, రోజు వారికిచ్చే ఆహార మెనూ, వయసుకు తగ్గట్టు పొడవు, బరువు ఉన్నారా లేదా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గర్భిణీ స్త్రీలు, బాలింతలకు వచ్చే పోషణ్ అభియాన్ కిట్లను సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో గుడ్లు లేవని కార్యకర్త సమాధానం చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ ముందుగానే తెప్పించుకోవాల్సిన బాధ్యత లేదా అని కలెక్టర్ ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రాన్ని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. టాయిలెట్లను పరిశీలిస్తూ ట్యాప్ కనెక్షన్ ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంటి పిల్లలతో ముచ్చటించారు.అనంతరం గ్రామ సచివాలయ కేంద్రాన్ని తనిఖీ చేస్తూ వ్యవసాయ సిబ్బందితో రైతుల బీమా ప్రీమియం చెల్లింపుపై కలెక్టర్ ఆరా తీశారు. గ్రామ సచివాలయ సమీపంలో ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ పంట బీమా ప్రీమియం చెల్లింపు ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది అందరూ సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సర్వీసులు గడువులోగా అందించాలని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారని ఉపాధ్యాయులని ఆరాతీస్తూ శ్రద్ధగా నేర్పించాలని కలెక్టర్ పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు పాఠశాలకు గైరాజరు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు అందుబాటులో వున్న టాయిలెట్లను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## అనకాపల్లి పరవాడ ఫార్మాసిటీలో గ్యాస్‌లీక్..

### ఒకరు మృతి..మరో 9 మందికి అస్వస్థత

అమరావతి : ఏపీలోని అనకాపల్లి జిల్లా పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో గ్యాస్‌లీకై ఒకరు మరణించగా మరో 9 మంది తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఠాగూర్ లేబొరేటరీస్‌లో విషవాయువులు లీకై అందులో పనిచేస్తున్న కార్మికులు అస్వస్థతకు గురి కాగా చికిత్సపొందుతూ ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అమిత్(23) అనే కార్మికుడు మృతి చెందాడు. అస్వస్థతకు గురైన కార్మికులను గాజువాకలోని పవన్‌సాయి ఆసుపత్రికి తరలించారు.ఘటనా విషయం తెలుసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు స్పందించి బాధితులకు అండగా ఉండాలని జిల్లా మంత్రులను ఆదేశించారు. పరిశ్రమల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినా నిర్లక్ష్యంపై హోం మంత్రి వంగలపూడి ఆగ్రహం వ్యక్తం చేశారురియాక్టర్ కమ్ రిసీవర్ ట్యాంక్ నుంచి లిక్విడ్ హెచ్‌సీఎల్ లీకైందని కలెక్టర్ తెలిపారు. తొమ్మిది మంది కార్మికులకు శ్వాస, దగ్గు సమస్యలు వచ్చాయని తెలిపారు. వీరంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు.

# సంపాదకీయం

గురువారం 28-11-2024

## తెలుగు రాష్ట్రాల్లో ఆదానీ ప్రకంపనలు

అదానీ పేరు ఈ మధ్య కాలంలో ప్రతీ రాజకీయ నేత కామెంట్స్‌లో వినబడుతోంది. ఇప్పటి వరకు దేశ రాజకీయాల్లో గట్టిగా వినిపించే అదానీ పేరు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అదానీతో ఒప్పందాలే తప్పు అన్నట్టు సీన్ మారింది. ఇటీవల కాలంలో అదానీ వ్యాపారాలపై వస్తున్న విమర్శలు కారణంగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. దేశ సంపన్నుల జాబితాలో గౌతమ్ అదానీది రెండో స్థానం. ఆయనకు చాలా వ్యాపారాలు ఉన్నాయి. ఇటీవల అమెరికా సెక్యూరిటీస్ అండ ఎక్సెంజ్ కమిషన్, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ ప్రకారం 5 రాష్ట్రాల్లో సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ముడుపులు ఇచ్చారని ఆరోపణ. కీలక వ్యక్తులకు 2,029 కోట్లు చెల్లించారన్నట్టు విమర్శలు ఉన్నాయి. ఏపీలోని కీలక వ్యక్తులకు 1750 కోట్లు చెల్లించారని ఎఫ్. బీ. ఐ ప్రకటనలో తేలింది. ఇది ఇప్పుడు ఏపీలో అప్పట్లో సీఎంగా ఉన్న జగన్ మెడకు చుట్టుకుంటుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ వివాదంపై అప్పటి ఏపీ విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. అర్థరాత్రి సంతకం చేయమని ఒత్తిడి చేస్తే తాను చేయలేదని చెప్పారు. కేబినెట్ మీటింగ్‌లో ఈ ఒప్పందానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుందని వివరించారు. ఆ విషయంలో వాస్తవాలు తనతో చర్చించలేదని, అందుకే అర్థరాత్రి సంతకం చేసేందుకు నిరాకరించినట్లు చెప్పారు. ఇందులో తన ప్రమేయం ఏదీ లేదన్నారు. ముడుపుల విషయం ఏదీ తనకు తెలియదని అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలి నేని స్పష్టం చేశారు. మంత్రిగా ఆ ఒప్పందంలో, ముడుపుల ఆరోపణల్లో తన ప్రమేయం ఏదీ లేదని అప్పటి సీఎం జగన్ ప్రమేయం ఉన్నట్లు తేల్చేశారు. దీంతో ఇది వైఎస్ఆర్సీపీకి రాజకీయంగా దెబ్బ తగిలింది. ముడుపుల చెల్లింపు విషయంలో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం జగన్ టార్గెట్‌గా స్పందించారు. జగన్ అవినీతి విశ్వవ్యాప్తమైందని విమర్శించారు. అమెరికాలో కేసు వివరాలు అన్నీ తమ వద్ద ఉన్నాయని దీనిపై చర్య తీసుకుంటామన్నారు. అయితే దీనిపై ఏపీ కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో అన్నది ఆసక్తి కరంగా మారింది. ఈ ఒప్పందంపై పూర్తి దర్యాప్తు చేస్తారా లేదా ఒక వేళ చేస్తే ఆ పర్యవసానాలు జగన్‌కే పరిమితం అవుతాయా లేదా అంతకు మించి విస్తరిస్తాయా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే ఏపీలో కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీ గ్రూప్ లీజుకు తీసుకుంది. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది అన్నది ఆసక్తికరం. రాజకీయంగా మాత్రం జగన్‌ను ఇబ్బంది పెట్టే విషయం చంద్రబాబుకు దొరికినట్లే అంటున్నారు. మరి రానున్న రోజుల్లో దీనిపై చంద్రబాబు సర్కార్ ఎలా వ్యవహరిస్తుందో అన్నది మాత్రం వేచి చూడాలి. యూఎస్ సెక్యూరిటీ అండ్ ఎక్సెంజ్ కమిషన్ ఆరోపించిన వెంటనే వైఎస్ఆర్సీపీ స్పందించింది. ఏపీ ప్రభుత్వానికి ముడుపుల ఆరోపణలకు సంబంధం లేదని తోసిపుచ్చింది. ఏపీలో 7 గిగా వాట్ల సోలార్ పవర్ కోసం తాము అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకోలేదని తేల్చిచెప్పింది. సోలార్ పవర్ కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సెకీ )తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని వివరించింది. జగన్ సర్కార్ ముడుపులు తీసుకున్నారని టీడీపీ నేతలు విమర్శలు చేస్తుంటే, అదానీ గ్రూప్‌తో నేరుగా ఒప్పందమే చేసుకోనప్పుడు ముడుపుల ఆరోపణలు ఎలా వస్తాయని వైసీపీ కౌంటర్ ఎటాక్ చేస్తోంది. ఇలా తాజా రాజకీయాల్లో ఏపీలో అదానీ వ్యవహారం రాజకీయ రచ్చకు దారి తీసింది. ఏపీలో ముడుపుల వ్యవహారం వెలుగు చూడటంతో తెలంగాణలో కూడా రాజకీయ ఆరోపణలు వచ్చాయి. రాజకీయంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర ఆరోపణలకు దిగాయి. అదానీ మీకు ఫ్రెండ్ అంటే మీకు ఫ్రెండ్ అని ఎదురు దాడికి దిగే పరిస్థితి నెలకొంది. ఒక్క సారిగా ఈ విషయం తెలంగాణలో పొలిటికల్ హీట్ ను పెంచింది. బీజేపీ పై విమర్శలు గుప్పించే ప్రతీ సారి ఆ పార్టీ అదానీ- అంబానీల కోసమే పని చేస్తుందన్నది బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణ. రైతులను, పేద ప్రజలను వదిలి సంపన్నుల కోసం పని చేసే ప్రభుత్వం మోదీ ప్రభుత్వం అన్నది గులాబీ పార్టీ నేతలు చేసే విమర్శ. అంతే కాకుండా రేవంత్ సర్కార్‌ను కూడా టార్గెట్ చేశారు. స్కిల్ యూనివర్సిటీకీ అదానీ నుంచి వంద కోట్ల విరాళం, అదానీ గ్రూప్‌తో 12,400 కోట్ల ఒప్పందాలపై విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి కేంద్రంగా విమర్శలు చేశారు. ఓ వైపు అదానీ వ్యాపార శైలి, మోదీతో సాన్నిత్యంపై రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే, ఇక్కడి కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడు అదానీని తెలంగాణలో అడుగు పెట్టనీయ లేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెడ్ కార్పెట్ వేస్తున్నారని ఆరోపించారు.

# మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్....

హైదరాబాద్, నవంబర్ 27, తెలంగాణలో కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీల మధ్య రోజు రోజుకు పొలిటికల్ వార్ తీవ్రమవుతోంది. రెండు పార్టీలకు చెందిన నేతలు మాటల యుద్ధానికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి పాలనపైన, ఇచ్చిన హామీల అమలు, హైడ్రా పేరుతో అక్రమ కట్టడాల కూల్చివేత, ఇళ్లు కూలిన బాధితుల విషయాలు, లగచర్ల అల్లర్ల ఘటన వంటి అంశాలపై ఇప్పటికే బీఆర్ఎస్ దూకుడుగా వెళుతోంది. మరో వైపు రేవంత్ రెడ్డి సైతం బీఆర్ఎస్ మాటల దాడికి ప్రతి దాడి చేస్తూనే ఉన్నారు. అయితే ఇక ఇప్పుడు మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్ కు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుందా అన్న చర్చ సాగుతోంది. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ ఇప్పటి దాకా పక్కన పెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ కు పదును పెట్టనుందా అన్న చర్చ సాగుతోంది. కేసు పూర్వాపల్లోకి వెళితే.. తెలంగాణలో జరిగిన శాసన సభ ఎన్నికల తర్వాత గులాబీ పార్టీ బీఫాం అందుకుని గెలిచిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ లు కాంగ్రెస్ లో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. తెలంగాణఅసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, వివేకానంద రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఫిరాయింపుపై సుప్రింకోర్టు మార్గదర్శ కాలను స్పీకర్ అమలు చేయడం లేదని ఆ పిటిషన్ లో పిటీషనర్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. దీంతో అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టుడివిజన్ బెంచ్ ను ఆశ్రయించడం జరిగింది. అయితే దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ ఇరువర్గాల వాదన విన్న తర్వాత తన తీర్పును ప్రకటించింది. రీజనబుల్ టైంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ల ఫిరాయింపు పై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని తన తీర్పులో పేర్కొంది. అంటే స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు స్పష్టంగా ఎలాంటి గడువు విధించకపోవడం తో ఇక ఇప్పుడు ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై తుది నిర్ణయం స్పీకర్ ఎప్పుడు తీసుకుంటారన్న స్పష్టత లేదు. ఇప్పటి వరకు హైకోర్టు నిర్ణయం పైవేచి చూసిన కాంగ్రెస్ పార్టీ ఇక ఇప్పుడు ఆపరేషన్ ఆకర్షక్ కు తెర లేపుతుందన్న వాదనలు వినవస్తున్నాయి. తన ఢిల్లీ పర్యటన లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా కుటుంబ సభ్యుల వివాహ వేడుకలకు హాజరయ్యేందుకే అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలోనే కాంగ్రెస్ హై కమాండ్ తోను ముఖ్యమైన విషయాలు చర్చించే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. అందులో మంత్రి వర్గ విస్తరణ ఒకటి కాగా, మరో అంశం ఆపరేషన్ ఆకర్ష్. దీనికి కాంగ్రెస్ హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే వెంటనె బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే దిశగా చర్యలు ఉంటాయని కాంగ్రెస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. గతంలోనే పలువురు మంత్రులు 20-25 మంది గులాబీ ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని, వాళ్లు వస్తే ఇక బీఆర్ఎస్ లో మిగిలేది కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా మరో ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే అని చెప్పిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. అక్కడ కాంగ్రెస్ హైకమాండ్ తో ఈ తాజా పరిణామాలన్నీ చర్చించే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ దూకుడు తగ్గించేందుకు శీతాకాల అసెంబ్లీ సమావేశాల ముందే కొద్ది మందిని పార్టీలో చేర్చుకోవాలా లేక జీహెచ్ఎంసీ ఎన్నికల ముందా అన్న చర్చ జరుగుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేతలు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు టార్గెట్ గా ఆపరేషన్ ఆకర్ష్ జరుగుతుందని చెబుతున్నారు. శాసన సభ ఎన్నికల్లో తెలంగాణ రూరల్ లో కాంగ్రెస్ కు ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నారు. కాని గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ చతికిల పడింది. కంటోన్మెంట్ కు జరిగిన ఉపఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ ఒక్క స్థానంలో గెలిచింది. దీంతో గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి నజర్ పెట్టారు. అయితే గ్రేటర్ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాసం ఉండటంతో శీతాకాల సమావేశాల ముందే ఈ ప్రక్రియ ఉండవచ్చన్న వార్తలు వస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటయి దాదాపు ఏడాది కావోస్తోంది. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యను బట్టి ముఖ్యమంత్రితో కలిపి 18 మందితో మంత్రి మండలి ఏర్పడాల్సి ఉంది. అయితే సీఎం రేవంత్ రెడ్డి సహా 12 మంది మాత్రమే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాది నుండి 12 మంది తోనే రేవంత్ సర్కార్ పాలన సాగిస్తోంది. మరో ఆరుగురు మంత్రులు గా ఎంపిక కావాల్సి ఉంది. అయితే ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా ఆరు మంత్రి పదవులు ఉద్దేశపూర్వకంగానే అలా అట్టి పెట్టినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీలో చేరిన ఒకరిద్దరు సీనియర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానం చేసినట్లు ఆ ఎమ్మెల్యేలు తమ సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. మరికొందరు పార్టీలోకి రావాలంటే మంత్రి పదవుల తాయిలం చూపించాల్సిన అవసరం ఉంది. అందుకోసమే పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణ చేయకుండా ఆగారని అటు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపాలంటే జీహెచ్ఎంసీ పరిధిలో మరి కొందరు సీనియర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను పార్టీలో చేర్చుకునే వ్యూహంతో రేవంత్ రెడ్డి ఉన్నట్లు సమాచారం. అవసరం అయితే వారికి మంత్రి పదవులు కట్టబెట్టి జీహెచ్ఎంసీ పీఠం కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్నట్లు కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు. అదే నిజమయితే త్వరలోనే గ్రేటర్ పరిధిలోని మాజీ మంత్రులు తిరిగి మంత్రి పదవులు దక్కించుకోవడం ఖాయం.

## కాంగ్రెస్ నేత వీహెచ్ కారును ఢీకొట్టిన వాహనం



హైదరాబాద్, నవంబర్ 27, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. హైదరాబాద్ అంబర్‌పేటలో వీహెచ్ ఇంటి ముందు పార్క్ చేసిన కారును బుధవారం తెల్లవారుజామున దుండగులు ఓ వాహనంతో ఢీకొట్టి ధ్వంసం చేశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీహెచ్ ఫిర్యాదుతో అంబర్‌పేటలోని ఆయన నివాసానికి వచ్చిన పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించారు. కారు నంబర్ ప్లేట్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, ఈ ఘటనపై వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి అని వీహెచ్ తెలిపారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి.

వరంగల్ డి ఎం హెచ్ ఓ.బి.సాంబశివరావు.


వరంగల్ .మండల పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యులు నాణ్యమైన వైద్యాన్ని అందించి వారి మన్ననలను పొందాలని వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ డి సాంబశివరావు అన్నారు. వరంగల్ జిల్లాలోని ఖానాపురం చెన్నారావుపేట మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు అనంతరం వారికి తగు విధమైన సూచనలు అందించారు. సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ముక్కు కారడము, అస్తమ, శ్వాస కోస వ్యాధులు, హార్ట్ ఎటాక్స్ ,చర్మ సంబంధిత వ్యాధులు మొదలగునవి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలకు, వృద్ధులకు షెటర్స్, గ్లౌజెస్ ,దుప్పట్లు నిండుగా కప్పుకొని చలికి గురి కాకుండా ఉండాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలన్నారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని తెలిపారురు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలని కోరినారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించినారు కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ అరుణ్ చంద్ర, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సరోజ ,పల్లె దావకాన డాక్టర్లు ,డిప్యూటీ డెమో అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏర్పాటులో మహాయుతి విఫలం.. మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన విధించాలి : సంజయ్ రౌత్



న్యూఢిల్లీ: మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా తేలలేదు. నాలుగు రోజులుగా ఈ అంశంపై తీవ్రంగా చర్చ నడుస్తోంది. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శివసేన నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటులో మహాయుతి కూటమి విఫలమైందని విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను అమలు చేయాలన్నారు 'అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి భారీ మెజారిటీ వచ్చింది. నవంబర్ 26వ తేదీతో శాసనసభ పదవీకాలం కూడా ముగిసింది. అయినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతోంది. ఇప్పటి వరకూ ముఖ్యమంత్రిని కూడా నిర్ణయించలేదు. మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం అనే పరిస్థితి వచ్చినప్పుడు 26వ తేదీలోగా ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే రాష్ట్రపతి పాలన విధించాలి' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు గానూ.. బీజేపీకి 132, శివసేనకు 57, ఎన్సీపీకి 41 స్థానాలు లభించాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి మార్గం సుగమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే మంగళవారం రాజీనామా చేశారు. కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టేవరకూ ఆపద్ధర్మంగా కొనసాగాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ షిండేను కోరారు.

## ప్రజలు తిరగబడతారని ప్రభుత్వ పెద్దల్లో వణుకు : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ నవంబర్ 27, తాము చేసిన తప్పులకు ప్రజలు తిరగబడతారని.. ప్రభుత్వ పెద్దల్లో వణుకు పడుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బంధిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగు బాటులను అణిచివేయాలనుకోవడం మూర్ఖత్వమన్నారు .మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. దీంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# పలాసలో భూ సేకరణ రగడ

శ్రీకాకుళం, నవంబర్ 27,పలాస నియోజకవర్గంలో నూతన ఎయిర్‌పోర్ట్ ఖాయమని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రెండుచోట్ల స్థలాన్ని పరిశీలించి ఎయిర్ పోర్ట్ అథార్టీకి ప్రాథమికంగా నివేదికను అందజేశారు. ఈ మేరకు రెండు రోజులపాటు అధికారుల బృందం పర్యటించి పరిశీలిస్తోంది. ఈ మేరకు గురువారం కేంద్ర బృందానికి ఆర్డీవో స్థలాలను చూపించారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు విడుదల చేయడం తెలిసిందే. ఈ మేరకు ఎయిర్పోర్టుకు చెందిన బృందం రావడంతో పలాస ఆర్డీవో జి. వెంకటేశ్వరరావు ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాలను పరిశీలించారు. ఎయిర్ పోర్టుకు 1383.71 ఎకరాల విస్తీర్ణం అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో 295.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, రైతుల నుంచి 1088.58 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని రెవెన్యూ అధికారులు ఎయిర్ పోర్ట్ అధికారులకు వివరించారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. మందస మండలంలో బిడిమి, బేతాళపురం, టి. గంగువాడ, వజ్రపుకొత్తూరు మండలంలోని చీపురపల్లి, మెట్టూరు ప్రాంతాలను ఎయిర్ పోర్ట్ అధికారులు సందర్శించి క్షేత్ర స్థాయిలో మట్టి, సముద్రతీరం, జాతీయ రహదారి ఇతరత్రా అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ ప్రాంతంతో పాటు రాష్ట్రంలో మరో ఐదుచోట్ల ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి తగిన సూచనలు ఇచ్చారని అధికారులు స్థానికులతో ముచ్చటించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలించిన బృందం రెవెన్యూ అధికారులతో చర్చించారు. జియాలజిస్టులు కూడా ఈ బృందంతో పాటు ఉన్నారు. ఈ మినీ ఎయిర్ పోర్టు నిర్మాణంతో ఉద్దానం ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మూలపేట పోర్టు నిర్మాణం, ఇటు ఎయిర్ పోర్టు పూర్తి చేస్తే ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో గల ఉద్దానం ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. తద్వారా స్థానికుల తలరాత మారే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్పోర్టు



సన్నాహాల్లో మహర్దశ పట్టనుందని ఆర్డీవో వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సరిహద్దు ప్రాంతంలో ఇదివరకే నిర్ధారించిన స్థలాన్ని ఈ బృందానికి చూపించినట్లు తెలిపారు. సాధ్యసాధ్యాలపై వారు నిర్ణయం తీసుకుంటారని, స్థానికులు కూడా పోర్టు నిర్మాణానికి సహకరించాలన్నారు.పలాస నియోజకవర్గం మందస మండలం బేతాళపురం బిడిమి లక్ష్మి పురం వజ్ర కొత్తూరు మండలం చీపురుపల్లి మెట్టూరు ఈ రెండు ప్రాంతాల్లో రెండు ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈ అంశంపై ఆదివారం పలాస సూది కొండ లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సభ్యులు మాట్లాడారు. ఎయిర్పోర్ట్ లకు 1400 ఎకరాలు భూసేకరణ చేయడానికి సిద్ధమయ్యారు. కానీ ఎయిర్‌పోర్టులు ఎందుకు వస్తున్నాయి, ఇవి అభివృద్ధి కొరకేనా, దీని ఎవరి ప్రయోజనాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఉద్దానం ప్రజలకు ఎయిర్పోర్ట్ వలన ఏం ఉపయోగం ఉంటుందన్న చర్చ మొదలైంది. వాణిజ్య పంటలు పండుతున్నచోట 1400 ఎకరాలు ఎయిర్ పోర్ట్ కోసం సేకరించాల్సి ఉంటుంది. ఈ వివరాలతో కూడిన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా భూమిని గుర్తించి మార్కింగ్ చేయడం సరైన పద్ధతి కాదు వెనకబడ్డ ప్రాంతం ఉద్దానం అభివృద్ధి చేయాలంటే పరిపరిశ్రమలు కావాలి. ఆ పరిశ్రమలు కూడా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలై ఉండాలి. విదేశాలలో నిషేధం ఉన్న అన్ని ప్రాంతాల్లో కాదనే పరిశ్రమలు పొల్యూషన్ వెదజల్లే పరిశ్రమలు ప్రజలు ప్రాణాల్ని హాని కలిగించే పరిశ్రమలు ఈ ప్రాంతంలోకి ఎందుకు తెస్తున్నారని స్థానికంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో థర్మల్ పవర్ ప్లాంట్ లు తీసుకొచ్చారు. అప్పుడు జరిగిన పోరాటంలో ఆరుగురు మరణించారు ఇప్పటికే ఆ జీవోలు రద్దు లేదు విధ్వంసం వినాశనం చేసే వాటికి అభివృద్ధిని పేరు తగిలిస్తున్నారు.కోస్టల్ కారిడార్‌లో భాగంగా తీర ప్రాంత భూములు లక్షలాది ఎకరాలు సేకరణ చేస్తున్నారు. దీని వెనక ప్రభుత్వానికి ఒక వ్యూహం ఉంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో అప్పుడు కూడా ఈ ప్రాంతం మీద దృష్టి సారించారు.

# గ్రీన్ ఎనర్జీ కొనుగోళ్లలో జగన్ బుక్కైనట్టేనా



విజయవాడ, నవంబర్ 27, అమెరికాలో కేసు.. దేశాన్ని ఊపేస్తున్న వ్యవహారం.. అపోజిషన్ నేతను టార్గెట్ చేస్తున్న తీరుతో.. సోలార్ పవర్ కొనుగోళ్ల కేసు ఓవర్ టు ఏపీ అయిపోయింది. దేశం మొత్తం అదానీ సెంట్రిక్‌గా చర్చ జరుగుతుంటే ఏపీలో మాత్రం జగన్‌ను కార్నర్ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జగన్‌ను ప్రాసిక్యూట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోందట రాష్ట్ర ప్రభుత్వం. విద్యుత్ కొనుగోలు అగ్రిమెంట్ వ్యవహారంలో అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ గౌతమ్ అదానీతో పాటు ఆయన సన్నిహితులపై కేసు పెట్టింది.2021లో ఏపీ ప్రభుత్వం 7 వేల మెగావాట్ల సోలార్ పవర్ విద్యుత్‌ను కొనడానికి రూ.1750 కోట్ల లంచం ఇచ్చారని..ఈ వ్యవహారంలో అప్పటి ఏపీ సీఎం ఉన్నారని ప్రస్తావించారు. దీని ఆధారంగా జగన్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టొచ్చా అన్న కోణంలో కూటమి ప్రభుత్వం న్యాయ నిపుణుల సలహా కోరినట్లు తెలుస్తోంది. జగన్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతి కోరాలని కూడా ఏపీ ప్రభుత్వం భావిస్తోందట.జగన్ మీద యాక్షన్ తీసుకోవడానికి ఏపీ సర్కార్‌కు లీగల్‌గా ఎంతవరకు అవకాశం ఉందనేది ఇక్కడ హాట్ టాపిక్‌గా మారింది. అమెరికాలో నమోదైన కేసుల వ్యవహారం.. ఇష్యూ కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేలా సిచ్యువేషన్స్ కనిపిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో జగన్ మీద చర్యలకు ఏపీ ప్రభుత్వం ముందడుగు వేయడం సాధ్యమేనా అన్న చర్చ జరుగుతోంది.సెకీతో పవర్ అగ్రిమెంట్లు చేసుకున్నాయి రాష్ట్ర ప్రభుత్వాలు. సెకీ కేంద్రప్రభుత్వ సంస్థ. ఒకవేళ ఏపీలో జగన్ మీద కేసు పెడితే సెకీ కూడా కార్నర్ అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు అదానీ వరకు వ్యవహారం వెళ్లే చాన్స్ లేకపోలేదు. అలా జరిగితే కేంద్రప్రభుత్వం ఇరకాటంలో పడే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి సిచ్యువేషన్స్‌లో ఏపీ సర్కార్ వేసే అడుగులు కీలకంగా మారనున్నాయి.జగన్‌ను కార్నర్ చేయబోతే..సెకి, అదానీని కేసులో ఇన్వాల్వ్ చేయాల్సి ఉంటుందని అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఎన్డీయేలో కీలకంగా ఉన్న టీడీపీ అంతదూరం వెళ్తుందా అనేదే ఇంట్రెస్టింగ్‌గా మారింది. అయితే ప్రస్తుతం కూటమి నేతల విమర్శలు చూస్తుంటే మాత్రం జగన్ అడ్డగోలుగా దోచుకున్నారని ఎక్స్‌పోజ్ చేయాలని పిక్స్ అయినట్లు కనిపిస్తోంది. దానికి ఆధారంగా యూఎస్‌లో నమోదైన కేసును ఎంగ్జామ్ పుల్‌గా చూపిస్తోంది.అంతేకాదు జగన్, అదానీ మూడుసార్లు భేటీ అయ్యారని..ఆ మీటింగ్ వివరాలు ఎందుకు రహస్యంగా ఉంచారని ప్రశ్నిస్తోంది టీడీపీ. పవర్ పర్చేస్‌కు సంబంధించిన ఫైల్‌కు కేవలం ఏడు గంటల్లోనే ఆమోదం తెలిపారని ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి రూ.1.10 లక్షల కోట్ల విలువ చేసే విద్యుత్ కొనుగోళ్ల ఫైల్‌ను ఆర్థికశాఖ ఆఘమేఘాల మీద ఆమోదించిందని అలిగేషన్స్ చేస్తున్నారు కూటమి నేతలు. దీనివెనుక ప్రభుత్వ పెద్దలు ఎంతగా ఒత్తిడి చేయకుంటే ఫైల్ అంత తొందరగా కదులుతుందో చెప్పాలంటూ కృశ్చన్ చేస్తున్నారు.అయితే కూటమి నేతల ఆరోపణలకు బలం చేకూర్చేలా మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్ చేసిన కామెంట్స్ చర్చనీయాంశం అవుతున్నాయి. పవర్ కొనుగోళ్ల ఫైల్ మీద సంతకం కోసం తనను అర్ధరాత్రి నిద్రలేపారని ఆయన చెప్పిన మాటలు ఇప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. మిడ్ నైట్ సంతకం పెట్టుమంటున్నారంటే ఏదో ఉందని గ్రహించే తాను సైన్ చేయలేదని తర్వాత క్యాబినెట్‌లో పెట్టి ఆమోదం తెలిపారని బాలినేని అంటున్నారు. అలా అగ్రరాజ్యంలో కేసు..బాలినేని వ్యాఖ్యలతో కూటమి నేతలు వైసీపీని, జగన్‌ను కార్నర్ చేస్తున్నారు.అయితే పవర్ పర్చేస్ అగ్రిమెంట్ మీద ఏపీ సర్కార్ దర్యాప్తు చేయడం, పొలిటికల్‌గా..లీగల్‌పరంగా అంత ఈజీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. టీడీపీ ఎన్డీయేలో భాగంగా ఉండటంతో విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో కూటమి దూకుడుగా వెళ్లే అవకాశం లేదన్న చర్చ జరుగుతోంది. లీగల్‌గా కూడా అమెరికాలో కేసు ఉండటం..కేంద్రప్రభుత్వమే అదానీ మీద యాక్షన్ తీసుకోవడానికి ఎలాంటి స్టెప్ వేయకపోవడంతో..ఏపీ సర్కార్ చేసేదేం ఉండదని అంటున్నారు ఎక్స్‌పర్ట్స్.ఇదంతా రాజకీయ, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్న ఇష్యూ అంటున్నారు. సో జగన్ కరప్షన్‌కు పాల్పడ్డారని ఎక్స్‌పోజ్ చేయడం తప్ప ఏపీ సర్కార్ యాక్షన్ తీసుకోవడానికి అవకాశాలు తక్కువే ఉన్నాయంటున్నారు. కూటమి నేతలు మాత్రం పవర్ పర్చేస్ అగ్రిమెంట్ ఫైల్ ఆమోదం ప్రాసెస్ తీరును హైలెట్ చేస్తున్నారు. అంత తొందరగా గంటల వ్యవధిలో ఆమోదం తెలిపారంటేనే ఏదో ఇలఖత మాఫియా జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇలా ఓవరాల్ ఎపిసోడ్ చూస్తుంటే ఈ ఐదేళ్లు ఈ టాపిక్ పొలిటికల్‌గా డైలీ ఎపిసోడ్‌లాగే కొనసాగే అవకాశమే కనిపిస్తోంది.

## కడప ఎస్పీకి ఘాటుగా లేఖ వ్రాసిన తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసి ప్రభాకర్ రెడ్డి..

బద్వేలు ,ఆర్టీపీపీలో ఫ్లయాష్ తీసుకెళ్లేందుకు వెళ్లిన జేసీ ప్రభాకర్‌రెడ్డి వాహనాలను ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డుకున్నారని జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడుతున్నారు.జేసీ ప్రభాకర్ రెడ్డి కడప ఎస్పీకి వ్రాసిన లేఖలో ఆర్టీపీపీలో ఫ్లైయాష్ తీసుకెళ్లేందుకు మా వాహనాలను ఆదినారాయణరెడ్డి అన్న కుమారుడు భూపేష్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. అయినా మేం సంయమనం పాటించాం..వాళ్లు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. అందుకే వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చే సిమెంట్, ఇసుక వాహనాలను మేమూ అడ్డుకున్నాం. మీరు కోరిన మీదట వాటిని నడవడానికి అనుమతించాం. మా వాహనాలను అడ్డుకోకూడదని మేం కోరాం..అయినా పరిస్థితి మారలేదు. మేం ఆర్టీపీపీకి వాహనాలను పంపుతున్నాం..వాళ్లు ఆపితే మేం అంత ఈజీగా తీసుకోం. ఇటీవల వారు అదానీ సంస్థపై కూడా ఎటాక్ చేశారు. మేం అలాంటి వాళ్లం కాదు. రేపు మా వాహనాలను అడ్డుకుంటే మాత్రం వారి వేదింపులను సహించేది లేదు. తప్పకుండా సరైన సమాధానం చెప్తాం అంటూ కడప ఎస్పీకి లేఖ వ్రాశారు.

## ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లు డ్రైనేజ్ కాలువలు నిర్మాణ పనులు

కౌతాళం,రాష్ట్ర ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే .బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు కౌతాళం మండలం కౌతాళం గ్రామం వైయస్ఆర్ నగర్ నందు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి వారి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యస్.పాల్ దినకర్ ,వైస్ ఎంపిపి బుజ్జీ స్వామి, ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య,మాజీ చైర్మన్ వడ్డే రామన్న, మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు సత్యప్ప స్వామి, ఉమాపతి, సమ్మద్,వార్డ్ మెంబర్ రామకృష్ణ, వెంకట రామ రాజు, షేక్షవలి, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ రైల్వే జోన్ కు బిడ్డింగ్

విశాఖపట్టణం, నవంబర్ 27, (న్యూస్ పల్స్) ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశ వైజాగ్ రైల్వే జోన్ సాకారం కానుంది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం కోసం టెండరును పిలిచారు. డిసెంబర్ 2న ప్రీ బిడ్ నిర్వహిస్తారు. డిసెంబర్ 13 నుంచి బిడ్డింగ్ ప్రారంభం కానుంది.విశాఖ రైల్వే జోన్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.రైల్వే జోన్ నిర్మాణానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తరఫున ఈ టెండర్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బిడ్డింగ్ వేసేవారు ఒరిజినల్ డాక్యుమెంట్లను సమర్పించాలని పేర్కొన్నారు. జోన్ కార్యాలయం నిర్మాణానికి రూ.149.16 కోట్లు అంచనా వ్యయంతో డీపీఆర్ కేంద్రానికి గతంలోనే పంపారు.రైల్వే జోన్ నిర్మాణానికి అధ్యయనాలు పూర్తి కావడంతో విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం టెండర్లను రైల్వే జోన్ ప్రధాన భవన కార్యాలయ నిర్మాణానికి గానూ పిలిచారు. డిసెంబర్ 27లోపు టెండర్లను దాఖలు చేయాల్సి ఉంది. ఈనెల 29న విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా రైల్వే జోన్ ఆఫీసుకు పునాదిరాయి వేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.గతంలో ఆరిలోవ ప్రాంతంలోగల ముషిడివాడలో 'రైల్వే శాఖకు చెందిన 53 ఎకరాల్లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ భవనాన్ని నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు పంపినా ఈ స్థలాన్ని కేంద్రం ఆమోదించలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైల్వేజోన్ స్థాపనకు తొలి అడుగు పడడం మంచి పరిణామంగా పలువురు అభిప్రాయ పడుతున్నారు.విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు ఎదురుగా గల డాబాగార్డెన్స్ వద్ద వైర్‌లెస్ కాలనీలోని పదహారున్నర ఎకరాల రైల్వే స్థలంలోనే 11 అంతస్థుల భారీ భవన నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలోనే ఇక్కడ పాడుబడిన రైల్వే క్వార్టర్లను తొలగించి రైల్వే శాఖ చదును చేసి సిద్ధం చేసింది. 9 అంతస్థులు, రెండు సెల్లార్ పార్కింగ్ ఫ్లోర్లతో కలిపి మొత్తంగా 11 అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్ జోనల్ మేనేజర్ కార్యాలయాన్ని నిర్మాణం చేయనున్నారు.టెండర్లను సైతం పిలవడంతో డిసెంబర్ 27లోపు కొన్ని టెండర్లు దాఖలవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. జోన్ కార్యాలయం కోసం రూ.149.16 కోట్లు అంచనా వ్యయం అవుతుందని కేంద్రానికి గతంలోనే డీపీఆర్ పంపించడం జరిగింది. దీన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని కేంద్ర రైల్వే మంత్రి వైష్ణవ్ రైల్వేకు ఆదేశించారు. దక్షిణ కోస్తా రైల్వే జోనల్ కార్యాలయ ఎలక్ట్రికల్ ఎస్టిమేట్లను రెండు రోజుల క్రితం కేంద్రం ఆమోదించింది. సుమారు రూ.15.7 కోట్లు ఆమోదం పొందింది.జోన్ కార్యాలయానికి చెందిన ప్రతిపాదిత డిజైన్‌ను భువనేశ్వర్ 'కేంద్ర రైల్వే అధికారులు సైట్ సర్వే ప్లాన్, మాస్టర్ ప్లాన్, ఏరియల్ వ్యూ, ఫ్రంటెండ్ వ్యూ, స్ట్రీట్ వ్యూ, ఎంట్రన్స్ వ్యూ ఇలా అన్ని వైపుల నుంచీ డిజైన్‌ను తయారు చేసి వాల్తేరు రైల్వే అధికారులకు పంపిచారు. రైల్వే జోన్ భవన నిర్మాణానికి పునాది రాయితో ఆగకుండా పనులు ముందుకు సాగుతాయా? అన్నది చూడాల్సిందే.

## శ్రీశైలమల్లన్న భక్తులకు గుడ్ న్యూస్

శ్రీశైలం, నవంబర్ 27, కార్తీక మాసం కావడంతో అన్నీ దారులు జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం వైపే మళ్ళాయి. దీంతో మల్లన్న దగ్గరకు చేరాలంటే ట్రాఫిక్ సమస్యలను అధిగమించడం గగనమైపోతోంది. దేశ వ్యాప్తంగా శ్రీశైలం వస్తున్న శివయ్య భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా సమస్యను పరిష్కరించేందుకు రంగంలోకి దిగారు. ఈ నేపద్యంలో అధికారులతో మాట్లాడిన సీఎం శ్రీశైలం-హైదరాబాద్ హైవే రద్దీ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యపై ఈరోజు అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, శ్రీశైలం ఘాట్ రోడ్డుతో పాటు దేవాలయానికి వెళ్లే మార్గాల్లో రద్దీని చక్కదిద్దాలని సూచించారు.శ్రీశైలం ఘాట్ రోడ్ లో ఈ మధ్య కాలంలో రోజురోజుకూ వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను నివారించేందుకు శాశ్వత పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేపట్టాలని అధికారులకు నిర్దేశించారు ముఖ్యమంత్రి. కార్తీక మాసం కావడంతో వేలాదిగా భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వస్తున్నారని, అందువల్లే ట్రాఫిక్ పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.శ్రీశైలం ప్రాశస్త్యం తో పాటు పెద్ద ఎత్తున దేవాలయాన్ని అభివృద్ధి చేసే మాస్టర్ ప్లాన్ ను ప్రభుత్వం చేస్తోందని, ఈ నేపద్యంలో రానున్న రోజుల్లో పెరిగే రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను స్వయంగా పరిశీలించి, పరిష్కార మార్గానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. అవసరమైతే పొరుగు రాష్ట్ర అధికారులతో సమస్యపై చర్చించి, సమన్వ యంతో భక్తుల ఇబ్బందులను తొలిగించాలన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు.

## రఘురామను చిత్రహింసలు పెట్టిన కేసు - విజయ్ పాల్ అరెస్టు

**సుదీర్ఘ విచారణ తర్వాత విజయ్పాల్ను అరెస్టు చేసిన పోలీసులు**

ఒంగోలుమాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలు పెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న సీఐడీ విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఆర్. విజయ్ పాల్ ను పోలీసులు అరెస్టు చేశారు. విజయ్ పాల్ మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు.ఉదయం 11 గంటల నుంచి విచారించిన పోలీసులు, రాత్రి 9 గంటల సమయంలో విజయ్ పాల్ ను అరెస్టు చేశారు. రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూవిజయపాల్ దాఖలు చేసిన పిటిషన్ను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన మంగళవారం ప్రకాశం జిల్లా పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు.రాత్రికి స్టేషన్లో ఉంచేందుకు ఏర్పాట్లు: ఉదయం 11 నుంచి రాత్రి 9 వరకు సుదీర్ఘంగా విజయ్పాల్ను విచారించారు. అనంతరం విజయ్ పాల్ ను అరెస్టు చేసినట్లు ఎస్పీ దామోదర్ ప్రకటించారు. ఈ మేరకు విజయ్ పాల్ రిమాండ్ రిపోర్టును పోలీసులు సిద్ధం చేశారు. విజయ్ పాల్ ను రాత్రికి ఒంగోలు పోలీస్ స్టేషన్లోనే ఉంచారు. బుధవారం ఉదయం గుంటూరు తరలించారు.

## మాచవరం హైస్కూల్లో సమగ్ర సర్వే పరిశీలన

**డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ పద్మావతి**

మాచవరం,పల్నాడు జిల్లా మండల కేంద్రమైన మాచవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వే కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో పద్మావతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ, విద్యార్థులకు ఆయుష్మాన్ భారత్ ద్వారా రక్తహీనత, దేహ పరీక్షలు నిర్వహించి సమగ్ర నివేదిక తయారు చేస్తారన్నారు. ఆర్ బి ఎస్ కే కార్యక్రమం ద్వారా ఈ ప్రోగ్రాములు కండక్ట్ చేసామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడు టీంలు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ క్యాంపు నిర్వహించాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అన్వేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మావతి ఆలయంలో లక్ష కుంకుమార్చన

తిరుపతి,తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 28 నుండి డిసెంబర్ 6వ తేది వరకు జరగనున్న కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహిస్తారు. అనంతరం అమ్మవారి ఉత్సవర్లను శ్రీకృష్ణస్వా మి ముఖ మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం 6.00 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షా బంధనం, ఆలయ నాలుగు మాడ వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించిన తరువాత శాస్త్రోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహిస్తారు.ఉత్సవాల సందర్భం గా ఆలయాన్ని అత్యంత సుంద రంగా తీర్చిదిద్దారు.

## రెండు రోజుల్లో తమిళనాడు తీరానికి తుఫాను

విశాఖపట్నం నైరుతీ బంగాళాఖాతం లో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడింది. దీంతో నేడు అది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఇది గంటకు 8కిలోమీటర్ల వేగంతో ముందుకు కదులుతుంది. ఉత్తర, వాయువ్య దిశగా కదులుతోంది.

నేడు తుపాను గా మారుతూ 2 రోజుల్లో తమిళ నాడు తీరానికి దగ్గరగా వస్తుందని వాతావరణం శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నవంబర్ 28, 29, 30 తేదీల్లో కురుస్తాయని, కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో నేటి నుంచి డిసెంబర్ 1 వరకు కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షా లు కురుస్తాయని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకపోవడమే మంచిదని అధికారులు తెలిపారు.

## బీవీ మోహన్ రెడ్డి స్మారక క్రికెటర్ టోర్నమెంట్ వాల్ పోస్టర్లు విడుదల చేసిన ఎమ్మెల్యే బీవీ



విభారే న్యూస్ నవంబర్ 27 ఎమ్మిగనూరు.శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి కీ.శే బీవీ మోహన్ రెడ్డి స్మారక అంతర్రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టోర్నమెంట్ కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. డిసెంబర్ 5వ తేదీ నుండి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర జనవరి 15వ తేదీ ఫైనల్ ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు ఈ టోర్నమెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు సురేష్ చౌదరి, రంగస్వామి గౌడ్, దోమ భీమేష్, ముల్లా జహీర్ అహ్మద్, భార్గవ్ యాదవ్, యూకే వీరేంద్ర, కృష్ణ తేజ నాయుడు, సోగనూర్ రాఘవేంద్ర, శంకర్ గౌడ్, అమనుల్లా,రఘు, నాగలదిన్నె సుధీర్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి,టీడీపీ కౌన్సిలర్లు,ఇన్ చార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 27-- పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నిరంజన్ రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సమావేశ భవనంలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగే సమావేశానికి వైస్ చైర్మన్లు. కౌన్సిలర్లు. కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని సూచించారు.

## 29.11.2024 న శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం నందు సుదర్శన హోమం..



విభారే న్యూస్ నవంబర్ 27 కౌతాళం..శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానం ఉరుకుంద దేవస్థానం నందు శుక్రవారం ఉదయం 9.00 గంటలకు సుదర్శన హోమం పూజ కార్యక్రమం నిర్వహించబడును. కావున భక్తాదులు ఆసక్తిగలవారు సుదర్శన హోమం నందు పాల్గొనటకు రూ.1500/-లు చెల్లించి శ్రీ స్వామివారి కృపకు పాత్రులగురని దేవస్థానం వారు తెలియజేశారు..

## జిల్లా పోలీసు కార్యాలయంలో కార్తీక మాస వనభోజన మహోత్సవం...

విభారే న్యూస్ నవంబర్ 27 కర్నూలు జిల్లా ప్రతినిధి..జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ కార్తీక మాసం పురస్కరించుకొని జిల్లా పోలీసు శాఖ పరిపాలనా విభాగం ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం స్దానిక జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్ హాజరై ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు.అనంతరం జిల్లా ఎస్పీ పోలీసు మినిస్టిరియల్ సిబ్బంది అందరితో కలిసి ఉసిరి చెట్టు క్రింద వనభోజనం చేశారు.కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే మంచి జరుగుతుందని, అందరూ ప్రతి సంవత్సరం ఈ విధంగా కుటుంబసభ్యులతో కలిసి ఇటువంటి కార్యక్రమాలను జరుపుకొని సంతోషంగా ఉండాలని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుస్సేన్ పీరా,డిపిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచిత విద్య ఇవ్వాలి( కావాలి)60 శాతం రాయితీ వద్దు 100% రాయితీ ముద్దు





విభారే న్యూస్ నవంబర్ 27. కర్నూల్ ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక జిల్లాలలో ప్రైవేటు పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అమలు అవుతుందని ఫోటో వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మిాసాల రామస్వామి తెలిపారు. బుధవారం కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లాకార్డ్స్ పట్టుకొని 60 శాతం అయితే వద్దు 100% రాయితీ ముద్దు అంటూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మిాసాల రామస్వామి మాట్లాడుతూ ఓవైపు వచ్చిరాని కొందరికి వేతనాలు మరోవైపు మరికొందరికి వేతనాలు లేకపోయినా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా అటు ప్రభుత్వ అధికారులకు ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి తీసుకెళ్లడంలో జర్నలిస్టు లు ముఖ్యపాత్ర వహిస్తున్నారన్నారు వహిస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో ఇంటి బాడిగలు కట్టలేక అరకొర ఆర్థిక వ్యవస్థలతో ఇబ్బందులు పడుతూ జర్నలిస్టు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక జిల్లాలలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య అమలు అవుతుందని కర్నూల్ లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు చెన్నయ్య,, సురేష్ రమేష్, రవి , వలి, జయ బాబు, ప్రసాద్ నరసింహ, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా బజారును పరిశీలించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి..



విభారే న్యూస్ నవంబర్ 27 ఎమ్మిగనూరు.ఎమ్మిగనూరు పొదుపు సంఘాల (మెప్మా)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజారును ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి పరిశీలించారు.పొదుపు సంఘాల మహిళలు చేసిన వస్తువులను ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పొదుపు సంఘాల సృష్టికర్త సీఎం నారా చంద్రబాబు నాయుడు అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు పెంచి వేసులుబాటు కల్పించారన్నారు. త్వరలోనే ఎమ్మిగనూరులో మెప్మా బజార్ తో పాటు మెప్మా సూపర్ మార్కెట్ ను ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ చేపడుతామని తెలిపారు.పొదుపు సంఘం మహిళలు చేస్తున్న వస్తువులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలు చేతు ద్వారా చేసే వస్తువులను మెప్మా బజార్లో అందుబాటులోకి తెచ్చారని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మెప్మా సిబ్బంది జయవర్ధన్,పొదుపు సంఘాల మహిళలు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థులకు డిఎస్ సి -2024 కు ఉచిత కోచింగ్

### రాష్ట్ర న్యాయ, మైనారిటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 27 - రాష్ట్రంలోని మైనార్టీల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా చర్యలు తీసుకోవడమే కాకుండా అమలు చేస్తున్నదని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో డీ ఎస్ సి -2024 ను కూటమి ప్రభుత్వం నిర్వహించబోతున్నదని తెలిపారు. ఇందులో భాగంగా డీఎస్ సి కి హాజరయ్యే రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. మైనారిటీ విద్యార్థులైన ముస్లింలు, క్రైస్తవులు (బి సి -సి ), సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు తదితరులుకు ఉచిత కోచింగ్ ప్రోగ్రామ్ను అందించడానికి అర్హులైన సంస్థలు మరియు అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించినట్లు మంత్రి తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రంలోని ప్రఖ్యాత ప్రైవేట్ సంస్థలతో ఎంప్యానెల్ చేయడం ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్రంలోని ఆసక్తిగల సంస్థలు, అభ్యర్థులు వెబ్సైట్ పోర్టల్ ద్వారా లేదా డైరెక్టర్ కార్యాలయం, మైనారిటీల విద్యా అభివృద్ధి కేంద్రం, స్వాతి థియేటర్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ-520012కి 10/12/2024న లేదా అంతకు ముందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇతర ముఖ్య వివరాలు తెలుసుకొనుటకు 0866-2970567ఈ -మెయిల్ ఐడి సంప్రదించవచ్చునని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధికి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి మైనారిటీలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు

## 20 కుటుంబాలు జనసేన పార్టీలో చేరిక.. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిల కం మధుసూదన్ రెడ్డి

ధర్మవరం నవంబర్ 27 )శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని వివిధ వార్డులకు సంబంధించిన 20 కుటుంబాలు జనసేన పార్టీలోకి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా చిలక మధుసూదన్ రెడ్డి పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చడం వల్లనే తాము జనసేన పార్టీలోకి చేరడం జరిగిందని, పార్టీ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలు నాయకుల దృష్టికి తీసుకొని వెళ్లి, న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం చిలక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేయాలని, పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక లాంటి వారిని తెలిపారు. పార్టీ కార్యకర్తల కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని, ఏ ఆపద వచ్చిన ముందు ఉంటానని వారు హామీ ఇచ్చారు.



## నేటి సాయంత్రం శ్రీ గాయత్రి దేవాలయంలో కార్తీక దీపోత్సవం..




విభారే న్యూస్ నవంబర్ 27 ఎమ్మిగనూరు. కార్తీకమాసం సందర్భంగా నేటి సాయంత్రం 7.30 గంటలకు కార్తీకదీపోత్సవం జరుగుతుంది. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలోపాల్గొనిఅమ్మవారి అనుగ్రహం పొందగలరని ఆలయ అర్చకులు బలకుంది నరసింహ శాస్త్రి కోరారు..

## మహిళల పై అసభ్యంగా ప్రవర్తిస్తే నాన్ బెయిల బుల్ కేసులు-- జి. సుధాకర్ రెడ్డి సీఐ. 1 టౌన్

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 27 - ఎవరైనా మహిళల పట్ల బాలికల తో అసభ్యంగా ప్రవర్తించిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని 1వ టౌన్ సీఐ జి. సుధాకర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి చెందిన ఎస్.కరీముల్లా, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినందుకు అతని పై కేసు నమోదు చేసి కోర్టు కు హజరు పరచగా గౌరవ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అతనికి 7 రోజుల జైల్ శిక్ష విధించారని తెలిపారు . ముద్దాయిని నంద్యాల జైల్ కు తరలించామని తెలిపారు.

## పారిశుధ్యం మెరుగు పడాల్సిందే మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 27 - పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు . బుధవారం పట్టణంలో పలు కాలనీల్లో శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికిపలుసూచనలిచ్చారు. స్థానిక ప్రజలను తాగునీరు శానిటేషన్ పైపలువిషయాలు అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ యంత్రాంగం వారి విధులను మరింత చిత్తశుద్ధితో నిర్వర్తించాలన్నారు. వెంటఎమ్ ఈ గురప్ప యాదవ్.శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. లక్ష్మినారాయణ.ఆయాసచివాలయాలసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి పరీక్షన్ అభియాన్ యాప్ లో నమోదు చేసుకోండి

### ప్రభుత్వ ఆయుర్వేద అధికారి డా. జి. యశోదర




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 27 - - ప్రజలు తమ శరీర ప్రకృతిని తెలుసుకోవడం కోసం దేశ్ కా ప్రకృతి పరీక్షన్ అభియాన్ యాప్ లో నమోదు చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కాబట్టి ప్రజలు అవకాశాన్ని వినియోగించుకొని దగ్గర్లో ఉన్న ఆయుర్వేద వైద్యశాలలకు స్మార్ట్ ఫోను తీసుకొని పోయి తమ శరీర ప్రకృతి తెలుసుకొని తమ శరీర ప్రకృతికి అనుగుణంగా నడుచుకొని జబ్బులు రాకుండా చూసుకోవాలని నంద్యాల జిల్లా ఆయుష్ డిపార్ట్మెంట్ తరఫున ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, నంద్యాల వైద్యాధికారి డాక్టర్ జి. యశోదర ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సిఐ శివరాముడు ను కలిసిన టిడిపి మండల క్లస్టర్ ఇన్చార్జ్ తుమ్మల మనోహర్

ముదిగుబ్బ నవంబర్ 27 ముదిగుబ్బ మండలం టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ బుధవారం సిఐ శివ రాముడు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించి స్వాగతం తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన వెంట మండల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**